# రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలి

భూంపల్లిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏవో సత్యన్వేష్

మిరుదొడ్డి (అక్బర్‌పే-భూంపల్లి), ఆగస్టు 23 : రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల ఏవో సత్యాన్వేష్ అన్నారు. శుక్రవారం భూంపల్లి రైతు వేదిక భవనంలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏవో సత్యన్వేష్ మాట్లాడుతూ రూ. 2 లక్షలకుపై ఉన్న పంట రుణాలను అర్హులైన రైతులకు త్వరలోనే మాఫీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సాంకేతిక కారణల వల్ల రైతులకు రుణమాపీ రాకుంటే వెంటనే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు లోహిత్, సమ్రీన్ బేగం, అనూష రైతులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేత

అల్వాల్‌లో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, ఆగస్టు 23 : మిరుదొడ్డి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బెస్త నర్సింహులు కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి రూ. 1.20 లక్షలు ఎల్వోసీ చెక్కును అందజేశారు. అల్వాల గ్రామానికి చెందిన బాధితురాలు గడీల విజయలక్ష్మి కుటుంబానికి రూ.8వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నంట బాపురెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు గుండం రాజమహేందర్ రెడ్డి, ఎండీ.అహ్మద్, దిలీప్ రెడ్డి, ప్రసాద్, మల్లయ్య, గణేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ చేయాలని కోరితే అక్రమ కేసులా..

బీఆర్ఎస్‌అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి, మాజీచైర్మన్ చంద్రయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 23 : రైతులు రుణమాఫీ చేయాలని కోరితే అక్రమ కేసులు బనాయించడంపై బీఆర్ఎస్‌నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. హుస్నాబాద్‌లో బీఆర్ఎస్‌నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రూ. రెండులక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్ వాటిని అమలుచేయకుండా రైతులపై కేసులు నమోదు చేసి భయభాంత్రులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ నియోజక వర్గ అధికారి ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎండీ అన్వర్ విమర్శించారు. తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం గౌ రవెల్లిపై ముందడుగు ఎందుకు వేయలేదని బీఆర్ఎస్‌నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, చంద్రయ్య, అన్వర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్వీ రాష్ట్రనాయకుడు సూరంపల్లి పరశురాములు, కౌన్సిలర్ గూళ్లరాజు, నాయకులు బూక్యా లక్ష్మానాయక్, గొనెల మధుకర్, శ్రీనివాస్ గౌ డ్, బత్తుల జగ్జీవన్, కందుకూరి సతీశ్, రాజునాయక్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

# మొక్కలను సంరక్షించాలి

మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రేరణ

సిద్దిపేట,ఆగస్టు 23 : నాటిన ప్రతి మొక్క పెరిగేలా వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ప్రేరణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణమంతా పచ్చదనంతో పరిఢవిల్లుతుందన్నారు. అనంతరం 9వ,వార్డులో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక కౌన్సిలర్‌తో కలిసి ఆవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్వీరామెంటల్ ఇంజినీర్ దిలీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, సీవో రమ్య పాల్గొన్నారు.

# ఉద్యోగుల కృషి అభినందనీయం

జీపీపీ డిపోలో మొక్క నాటుతున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్

గజ్వేల్, ఆగస్టు 23 : డిపో అభ్యున్నతికి ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని హైదరాబాద్, కరీంనగర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో మొక్కలను నాటి ఉద్యోగులతో మాట్లాడారు. రాఖీ పండుగ సందర్భంగా ఉద్యోగులు అంకితభావంతో ప నిచేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చినందుకు అభినందించారు. డీఎం పవన్ పాల్గొన్నారు.

# అందె భాస్కర్‌కు జానపద సామ్రాట్ అవార్డు

కళాకారులను అభినందిస్తున్న రైటర్స్ అకాడమీ చైర్మన్ వీ వీ రమణమూర్తి

మిరుదొడ్డి, ఆగస్టు 23 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రపంచ జానపద దినోత్సవాన్ని రెండు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ఉత్సవాలను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం గురజాడ కళాక్షేత్రం వేదికగా ఈ నెల 23న ఉత్తరాంధ్ర జాతరను వైభవంగా నిర్వహించాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రం తరపున మహిళలు డప్పులతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. 21 ఏండ్ల పాటు డప్పు కళకు అందిస్తున్న సేవలను గుర్తించి అందె భాస్కర్‌కు జానపద సామ్రాట్ అవార్డును రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి అందజేశారు. మిరుదొడ్డి మండలంలోని అందె భాస్కర్ అవార్డు రావడంపై మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

# ముసాయిదా బిల్లుపై చర్చలో సీపీఎం సవరణలు

సిద్దిపేట కమాన్, ఆగస్టు 23 : రాష్ట్ర ప్రభుత్వం ధరణిని భూమాతగా మారుస్తూ 20 సెక్షన్‌లతో చట్టాన్ని రూపొందించి ముసాయిదాను విడుదల చేసి పార్టీలు, ప్రజలు నుంచి అభిప్రాయం కోరగా, సిద్దిపేట కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ముసాయిదా బిల్లుపై చర్చలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం పలు సవరణలు, సూచనలు చేశారు. తెలంగాణ రికార్డు ఆఫ్ రైట్స్ చట్టం 2024 1971 పాస్ పుస్తకాల చట్టంలో సెక్షన్ 26 పునరుద్ధరణ చేయాలని సూచించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, నాయకులు చల్లారపు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

# శాంతి భద్రతలను పరిరక్షించాలి

## పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ, హాజరైన సిబ్బంది

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23 : క్యూఆర్టీ నిర్వహించవలసిన విధుల గురించి కమిషనర్ కార్యాలయంలో సీపీ డాక్టర్ అనురాధ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో, ధర్నాలు, రాస్తారోకోలు జరిగినప్పుడు త్వరగా రియాక్ట్ కావాలని విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. జిల్లాలో ఎక్కడైన ఏదైనా సంఘటన జరిగిన కూఆర్టీ టీమ్స్ వెంటనే చేరుకోవాలన్నారు. ప్రజల ధనమాన ప్రాణ రక్షణకు మనం ఉన్నామని భరోసా కల్పించాలని సూచించారు. ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రారావు, సుభాష్ చంద్రబోస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న గడీల భైరవరెడ్డి

సిద్దిపేట టౌన్,ఆగస్టు 23 : రైతులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని తెలంగాణ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం రైతు సంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులు అందరూ బ్యాంకులకు వెళ్లి రూ. 2 లక్షల అప్పు తీసుకొండ్రి.. మా కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు శ్రీరామ్‌రెడ్డి,రామచంద్రరావు, పులి రంగారెడ్డి, రాజేంద్రప్రసాద్, మహేందర్, కరుణాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంపత్, ఎల్లం, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

గజ్వేల్, ఆగస్టు 23: చెట్టును బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొల్గూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో నివాసం ఉంటున్న నిజాంపేట మండలం తిప్పన్నగండ్ల గ్రామానికి చెందిన శేర్‌పల్లి స్వామి(40) అత్తగారిల్లు మిరుదొడ్డి మండలం కాసులబాద్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నక్రమంలో కొల్గూర్ వద్ద చెట్టుకు బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం తెల్లవారుజామున చూసిన రైతులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని పోలీసులు గజ్వేల్ దవఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వాహన దారులకు జరిమానా

సిద్దిపేట టౌన్,ఆగస్టు 23 : మద్యంతాగి వాహనాలు నడుపుతున్న మందుబాబులకు సిద్దిపేట న్యాయస్థానం శుక్రవారం జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ వివరాల ప్రకారం.. సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందితో నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాలతో పాటుగా రాజీవ్‌రాహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఆరుగురిని పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు జడ్జి కాంతారావు ఎదుటహాజరు పరుచగా, విచారణ జరిపి మందుబాబులకు రూ. 9,500 జరిమానా విధించారని తెలిపారు.

# బుల్లెట్‌పైకి దూసుకెళ్లిన కారు

## దంపతులకు తీవ్రగాయాలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 23 : బుల్లెట్ పైకి కారు దూసుకెళ్లిన ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. చిన్నకోడూరుకు చెందిన జర్రిపోతుల హరీశ్ ప్రభుత్వ దవాఖాన రోడ్డులో వేగంగా కారు నడుపుతూ బుల్లెట్‌పై వెళ్తున్న దంపతులపైకి దూసుకెళ్లాడు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని ప్రభుత్వ దవాఖాన తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గుగ్గిళ్లలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, ఆగస్టు 23: మండలంలోని గుగ్గిళ్ల గ్రామానికి చెందిన గుగ్గిళ్ల దుర్గయ్య, ర్యాకం లచ్చవ్వ ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు ముక్కీస రాజిరెడ్డి, నాగభూషణం, నాగుల నారయణ, కొంకటి సురేశ్, కొంకటి ఆగయ్య, తిరుపతి, కుమార్, శంకర్ బాబు, రాజేశ్, ఆదిమల్లయ్య, బాలయ్య, కిరణ్, బాబు తదితరులు ఉన్నారు.

# ఐవోసీ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

గజ్వేల్, ఆగస్టు 23 : గజ్వేల్‌లోని సమీకృత ప్రభుత్వ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన తెలిపి జీవో 28 ప్రతులను దహనం చేశారు. జీవో 28 ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వాలు అగ్రిమెంట్ చేసుకున్న రోజుకు నిరసనగా బ్లాక్‌డేగా నిరసన తెలిపారు. సీపీఎస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్, ఉద్యోగులు రాజు, బిలాల్, అనిత, వనజ, కమలాకర్, లవకుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# సేఫ్టీ మోకులపై గీతకార్మికులకు అవగాహన

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 23 : మండలంలోని పందిల్లలో శుక్రవారం గీతకార్మికులకు కాటమయ్య రక్ష కవచం(సేఫ్టీ మోకు)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ కులస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈత చెట్లను నాటారు. అనంతరం రాక్ క్లైంబింగ్‌లో శిక్షకుడు రాజు, ట్రైనర్స్ అశిష్‌గౌడ్, పురుషోత్తం, బుచ్చయ్య గౌడ్, వెంకటేశ్ గౌడ్ సేఫ్టీ మోకు వాడే విధానం, మెళకువలను గీతకార్మికులకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ గౌడ సంఘం చైర్మన్ మార్క అనిల్‌గౌడ్, ఎక్సైజ్ సీఐ ఎం పవన్, ఎస్సై రూప, బీసీ వెల్ఫేర్ అధికారి మహేశ్, గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లికి బోనాలు

పెద్దమ్మతల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 23 : మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని సామూహికంగా పెద్దమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. పెద్దమ్మ తల్లి బోనాల పండుగకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

చేర్యాల, ఆగస్టు 23 : చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నులిపురుగుల నివారణకు శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణకు ఏడాదికొసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారి మధు, ఆశాకార్యకర్త పద్మ తదితరులు ఉన్నారు.

# హరీశ్‌రావును విమర్శిస్తే సహించేది లేదు..

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 23 : పార్టీ టిక్కెట్లు ఇచ్చి కష్టపడి మిమ్మల్ని గెలిపించిన ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కాంగ్రెస్ చేరి విమర్శలు చేయడం సరికాదని ఎస్సీసెల్ టౌన్ పట్టణ అధ్యక్షుడు సందులపురం రాజు, నాయకులు సాయి ప్రేమ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. నంగునూరు మండలం చెందిన కాంగ్రెస్ నాయకుడు తన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు విమర్శలు మనకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో రమేశ్, మధు, పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పట్టి వేత

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 23 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. భూంపల్లి ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సమాచారం మేరకు శుక్రవారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనాల తనిఖీలను పోలీసులు చేపట్టారు. దుబ్బాక మండలంలోని పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన పర్వతం యాదగిరి బొలే రో వాహనంలో అక్రమంగా 60 సంచుల్లో 49,70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. పట్టుబడిన బియ్యంతో పాటు యాదగిరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# బీఆర్ఎస్‌తోనే మైనార్టీల అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ సెల్ నాయకులు

సిద్దిపేట,ఆగస్టు 23 : గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ మైనార్టీల అభివృద్ధికి ఎంతో చేసిందని, ముస్లింలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు వజీర్, మోయిజ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరిన కొంతమంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ ఏమి చేయలేదని మాట్లాడటం తగదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఒక ముస్లిం మైనార్టీకి మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మైనార్టీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం మాని, సంక్షేమం కోసం ఆలోచించాలని గుర్తుచేశారు. నాయకులు సయ్యద్, బాబా పాల్గొన్నారు.

# నేటి నుంచి బొడ్రాయి, పోచమ్మ విగ్రహాల పున:ప్రతిష్ఠాపన

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 23 : మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో నేటి నుంచి రెండు రోజుల పాటు బొడ్రాయి, పోచమ్మ ఆలయ, విగ్రహాల పున:ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (శనివారం) ఉదయం బొడ్రాయి వద్ద అభిషేకాలు, రుద్రహోమం, పోచమ్మ ఆలయం వద్ద అభిషేకాలు, హోమం, రేపు (ఆదివారం) ఉదయం 7 గంటలకు బొడ్రాయికి, 9 గంటలకు పోచమ్మతల్లికి, 10-30కి మహంకాళమ్మకు గ్రామస్తులు సామూహికంగా బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హుస్నాబాద్‌టౌన్ : డ్రమ్ములోని నీటిని పారబోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

గజ్వేల్, ఆగస్టు 23: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ యూనిట్ మెడికల్ అధికారి బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో ఫీవర్ సర్వే, శ్రీగిరిపల్లిలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటి ముందు మురుగు నిల్వ ఉండడంతో దోమలు వ్యాపిస్తాయని అందుకు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది సురేందర్, దీవెనమ్మ, వాసుదేవ్, నాగరాజు, దుర్గా, రమేశ్ పాల్గొన్నారు.

**జగదేవ్‌పూర్‌లో..**

జగదేవ్‌పూర్,ఆగస్టు 23 : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జగదేవ్‌పూర్ పీహెచ్‌సీ వైద్యులు సత్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫ్రైడే డే నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రతోనే వ్యాధులు దూరం**

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 23 : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ పనికిరాని వస్తువుల్లో నిలిచిన వర్షపునీటిని పారబోయించారు. కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్ బూక్యా సరోజన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, సూపర్ వైజర్ శంకర్, ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారులు పద్మ, ఆరుణ, జవాన్లు సారయ్య, ప్రభాకర్ ఉన్నారు.

# విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించాలి

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 23 : విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించాల్సిన సమయం వచ్చిందని డిగ్రీకళాశాల ఉపన్యాసకులు రాజ్యలక్ష్మి అన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంతరిక్షంలో అడుగుపెట్టడంలో మనమే ముందు ఉన్నామనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. విద్యార్థులు పరిశోధనతోపాటు కొత్త ప్రకియవైపు ఆలోచనలు చేసే నూతన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లును ప్రదానం చేశారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, మార్కేండేయ, శ్రీధర్, ఉపాధ్యాయులు వీరారెడ్డి, సువర్ణలీల, రాజేందర్, రమేశ్, సుభాశ్, వెంకటమల్లు, రాజమల్లు, రజిత, రాజయ్యతో పాటు విద్యార్థులు ఉన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

ములుగు, ఆగస్టు 23 : గంజాయి సేవించి పట్టుబడిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండల కేంద్రం ములుగులో శుక్రవారం మధ్యాహ్నం గ్రామశివారులో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో ఎస్సై విజయ్ కుమార్, ములుగు పోలీస్ సిబ్బందితో కలిసి నార్కోటిక్ డ్రగ్ టెస్టింగ్ మిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించగా, గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. గంజాయి సేవించిన యువకులు ములుగుకు చెందిన స్వామి, సురేశ్‌గా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు సేవించినా క్రయవిక్రయాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## అనుమతిలేని ఇసుక డంప్ సీజ్

ములుగు, ఆగస్టు 23 : అనుమతులు లేని ఇసుక డంప్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ములుగు మండల పరిధిలోని వంటిమామిడిలో అదే గ్రామానికి చెందిన రాజబోయిన పరశురాములు, లక్ష్మరి భిక్షపతి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా సుమారు 500 టన్నుల ఇసుకను డంప్ చేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నాం. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## విద్యార్థిదశలోనే అవగాహన పెంచుకోవాలి

వర్గల్, ఆగస్టు 23 : విద్యార్థి దశలోనే ప్రతి వ్యక్తి మంచిచెడులపై అవగాహన పెంచుకోవాలని షీ టీం బృందం సభ్యులు శ్రీరాములు, శ్యామల తెలిపారు. శుక్రవారం వర్గల్ మండలం నాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలు, ఈవ్‌టీజింగ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుధారాణి, షీటీం సభ్యులు రామచంద్రారెడ్డి స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాడులను అరికట్టాలి

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 23 : దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దాడులకు పాల్పడుతున్న వారిపై కఠ